సాక్షి అనంతపురం

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



పచ్చ నేతలకు ఉపాధి మేత

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు టీడీపీ నేతలకు కల్పతరువులా మారాయి.

IIలో



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.

రేపు పరిష్కార వేదిక లేదు

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ నెల 20వ తేదీ(సోమవారం) నిర్వహించడం లేదని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. దీపావళి సందర్భంగా ఆ రోజు ప్రభుత్వ సెలవు ఉన్నందున జరపడం లేదన్నారు.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: దీపావళి సందర్భంగా ఉమ్మడి జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు–కలబురిగి–యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లను ఈ నెల 19, 20, 21, 22 తేదీల్లో సింగిల్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులుగా నడుపుతున్నట్లు వెల్లడించారు. ఈ నెల 19న కలబురిగి–యశ్వంత్‌పూర్ (06204),20న బెంగళూరు–కలబురిగి (06207), 21వ తేదీ కలబురిగి–బెంగళూరు (06208), బెంగళూరు–కలబురిగి (06209), 22వ తేదీ కలబురిగి–యశ్వంత్‌పూర్ (06210) ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తాయని తెలిపారు. ఇవి యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూరు, కృష్ణ, యాదగిరి, వాడి, షాహబాద్ మీదుగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

'స్థానిక' ఎన్నికలపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ

అనంతపురం టవర్‌క్లాక్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇస్తున్నట్లు జెడ్పీ సీఈఓ శివశంకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాస్టర్ ట్రైనర్లుగా డీఎల్‌డీఓ, ఎంపీడీఓ, ఏఓలను ఎంపిక చేశామని తెలిపారు. వీరికి విజయవాడలో శిక్షణ ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 23 నుంచి 24 వరకు.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ ఎన్నికలపై ఈ నెల 30 నుంచి 31 వరకు శిక్షణ ఉంటుందని వెల్లడించారు.

అధికారం మనదే.. ఆడుకోండి



"రండి బాబూ రండి! కడప, కర్నూలు, మహబూబ్‌నగర్, గద్వాల, కర్ణాటక, తెలంగాణ, ఊరు ఏదైనా పర్వాలేదు. మా ఊరికి రండి! హాయిగా పేకాట ఆడండి! మస్తుగా ఎంజాయ్ చేయండి! పేకాట ఆడేందుకు ఇక మీరు రాయచూరు, బెంగళూరు, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పనిలేదు. ఎందుకంటే మా ప్రభుత్వం వచ్చింది! పేకాటకు ఇబ్బందే లేదు. మళ్లీ మనకు మంచి రోజులు వచ్చాయి. మీకు అన్ని మర్యాదలు చేస్తాం!" అంటూ పేకాట రాయుళ్లకు నిర్వాహకులు స్వాగతం పలుకుతున్నారు. కూటమి ప్రభుత్వంలో పేకాట నిర్వాహకులు యథేచ్ఛగా శిబిరాలు నిర్వహిస్తున్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు దీన్ని ఆదాయ మార్గంగా ఎంచుకుంటే, కొందరు పోలీసులు పోస్టింగ్‌తో పాటు డబ్బులు వస్తాయనే ఆశతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

'పేకాట'.. 'పచ్చ' పూదోట

- ఉమ్మడి జిల్లాలో జోరుగా గ్యాంబ్లింగ్
- ఇతర జిల్లాల నుంచి వచ్చే వారికి విమాన టిక్కెట్ నుంచి సకల మర్యాదలు
- ప్రజాప్రతినిధులతో పాటు పోలీసులకు నెల మామూళ్లు
- త్వరలో పలు రిక్రియేషన్ క్లబ్‌లలో పేకాట ఆడించేందుకు ఏర్పాట్లు!

సాక్షిప్రతినిధి, అనంతపురం: కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో పేకాటకు మార్గం సుగమమైంది. సర్కారు ఏర్పడిన కొత్తలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఏకంగా ముఖ్యమంత్రితో మాట్లాడి రాష్ట్రవ్యాప్తంగా పేకాట ఆడించేలా చూస్తా అని 'ఆఫీసర్ క్లబ్'లో వ్యాఖ్యానించారు. దీన్నిబట్టి పేకాట ఆడించి, డబ్బులు దండుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యేలు ఏ స్థాయిలో బరితెగించారో ఇట్టే తెలుస్తోంది! ఉమ్మడి 'అనంత'లో స్థానిక ఎమ్మెల్యేల ఆశీస్సులు, కొందరు పోలీసుల సహకారంతో ఆటాడిస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు, పోలీసులకు నెలవారీ మామూళ్లు నిర్ణయించి పేకాట నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఆదాయాన్ని చూసి కొందరు పోలీసులు పట్టుబట్టి మరీ 'పేకాట' పరిధిలోని స్టేషన్లకు వచ్చేందుకు యత్నిస్తున్నారు. ప్రజాప్రతినిధులు కూడా మరిన్ని శిబిరాలు ఏర్పాటు చేసుకోండని వారి అనుచరులపై ఒత్తిడి తెస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో జోరుగా..

- తాడిపత్రిలోని పాతమార్కెట్‌లో ఓ తెలుగు యువత నాయకుడి ఆధ్వర్యంలో క్లబ్ నడుస్తోంది. చుక్కలూరులో సుంకులమ్మ పాలెంకు చెందిన ఓ టీడీపీ నేత ఆధ్వర్యంలో ఆటాడిస్తున్నారు. ఓ మాజీ సర్పంచ్ తమ్ముడి ఆధ్వర్యంలో గన్నేవారిపల్లి కాలనీలో పేకాట నిర్వహిస్తున్నారు.
- ఉరవకొండ నియోజకవర్గం కొకుంట్లలో పేకాట క్లబ్బులు నడుస్తున్నాయి. మైలారం పల్లిలో 'అందర్ –బాహర్' నిర్వహిస్తున్నారు. కడప, పొద్దుటూరు, బళ్లారి, గుంతకల్లుతో పాటు చాలా ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ఆడుతున్నారు. ఒక్కొక్కరితో రూ.5 వేలు నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. కూడేరు మండలంలో పోలీసుల కనుసన్నల్లోనే విచ్చలవిడిగా పేకాట నడుస్తోంది.
- శింగనమల నియోజకవర్గం యల్లనూరు మండలం మల్లాగుండ్లతో పాటు పలు గ్రామాల్లో టీడీపీ నేతల కనుసన్నల్లో పేకాట నడుస్తోంది. గుంతకల్లు నియోజకవర్గంలో ఓ టీడీపీ నేత కనుసన్నల్లో పేకాట ఆడిస్తున్నారు.
- కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, బ్రహ్మసముద్రం,శెట్టూరు,కుందుర్పిలో పేకాట శిబిరాలకు కర్ణాటక వాసులు కూడా తరలివస్తున్నారు.
- హిందూపురం ఇందిరమ్మ కాలనీ, సేవామందిర్ పరిసరాల్లో టీడీపీ నేతలు రోజూ రూ.30 లక్షల వరకూ పేకాట ఆడిస్తున్నారు. ఇందిరమ్మ కాలనీలో కూటమి నేతకు చెందిన తోటలో నిత్యం పేకాట నడుస్తోంది. కగ్గల్లుకు చెందిన ఓ మాజీ సర్పంచ్ ఈ దందాలో కీలకంగా ఉన్నారు. చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లోనూ విచ్చలవిడిగా పేకాట నడుస్తోంది.
- ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లోని అటవీ, కొండ ప్రాంతాల్లో ఆడుతున్నారు.
- పుట్టపర్తిలో మొన్నటి వరకూ ఓ పోలీసు అధికారి కనుసన్నల్లోనే విచ్చలవిడిగా పేకాట సాగింది. ఆ అధికారికి నెలకు రూ.30 లక్షలు ఇచ్చేవారంటే ఏ స్థాయిలో నడిచిందో ఇట్టే తెలుస్తోంది. ఆ అధికారి బదిలీ తర్వాత తాత్కాలికంగా ఆట కట్టేశారు. ఇప్పుడు తిరిగి ఆడించేందుకు నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారు.



పేకాట రాయుళ్లకు ఇస్తున్న సదుపాయాలు ఇలా..

పేకాట ఆడేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి గదులు, రవాణా, కోరిన ఆహారం ఏర్పాటు చేస్తారు. రూ.2 లక్షల బ్యాంకు ఆడేవారికి డబుల్ బ్లాక్, గ్లెన్‌లివెట్ లాంటి విదేశీమందు ఇస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి విమాన టికెట్లు బుక్ చేస్తారు. ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువ మందిని పేకాటకు తీసుకొచ్చేవారికి నెలకు రూ.లక్ష–2 లక్షలు గిఫ్ట్‌గా ఇస్తారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం పేకాట జరిగే ప్రాంతాల్లో నియోజకవర్గ ప్రజాప్రతినిధికి నెలకు రూ.10 లక్షలు, పేకాట శిబిరానికి మంత్రి అనుమతిస్తే రూ.25 లక్షలు, స్థానిక పోలీసు స్టేషన్‌కు, ఆపై అధికారికి కొంత మొత్తం ఖరారు చేసి ప్రతి నెలా పంపిస్తున్నారు.

పేకాట ద్వారా నిర్వాహకులకు ఆదాయం

పేకాట బ్యాంకు	నిర్వాహకుడి రోజు ఆదాయం	నెల ఆదాయం
రూ.50వేలు	రూ.1.60 లక్షలు	రూ.48 లక్షలు
రూ.లక్ష	రూ.2.40 లక్షలు	రూ.72 లక్షలు
రూ.2 లక్షల బ్యాంకు	రూ.32 లక్షలు	రూ.4.80 కోట్లు

కళ్లు బైర్లు కమ్మాల్సిందే!

పేకాట స్మాల్ స్టేక్ (చిన్నబ్యాంకులు), హైస్టేక్ (పెద్దబ్యాంకులు)..ఇలా రెండు రకాలుగా జరుగుతోంది. స్మాల్‌స్టేక్‌లో రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ ఆడతారు. హైస్టేక్‌లో రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2లక్షలు..ఇలా మూడు రకాలు ఆడతారు.

- స్టేక్ ఏదైనా ఒక్కో బ్యాంకుకు 250 పాయింట్లు ఇస్తారు. పేకాట నిర్వాహకుడికి డబ్బులు ఇస్తే వారికి 250 పాయింట్ల లెక్కన కాయిన్లు ఇస్తారు. పేకాట శిబిరం వద్ద డబ్బు కట్టలు ఉండవు. శిబిరానికి వచ్చే ముందు నిర్వాహకుడు చెప్పిన కారు వద్దకు వెళ్లి డబ్బులు ఇస్తే ఆ మొత్తానికి సరిపడా కాయిన్లు ఇస్తారు. అయితే స్టేక్‌ను బట్టి పాయింట్ల విలువ మారుతుంది. ఒక్కో పాయింట్ విలువ రూ.50 వేల బ్యాంకు అయితే రూ.200, రూ.లక్షకు రూ.400, రూ. 2లక్షలకు రూ.8 వేలుగా నిర్ణయిస్తారు. ఊరు, శిబిరం ఎక్కడైనా పాయింట్ల రేటు మాత్రం ఇలాగే ఉంటుంది.
- ఒక్కో గేమ్ పది మంది ఆడతారు. కొన్ని సందర్భాల్లో ఏడుగురుంటారు. ఒక గేమ్ పూర్తయితే గెలిచిన వ్యక్తి ఖర్చుల కింద నిర్వాహకుడికి కొన్ని పాయింట్లు ఇవ్వాలి.
- రూ.50 వేలు బ్యాంకు ఆడేవారు 8 పాయింట్లు, రూ.లక్ష బ్యాంకు ఆడితే 6, రూ.2లక్షలు ఆడితే 4 పాయింట్లు ఇవ్వాలి. ఈ లెక్కన రూ.50 వేలు బ్యాంకు ఒక ఆటకు నిర్వాహకుడికి రూ.1600, రూ.లక్ష బ్యాంకు ఆటకు రూ.2,400, హైస్టేక్ అయిన రూ.2లక్షల బ్యాంకు ఆటకు రూ.32 వేలు వస్తుంది.
- ఒక శిబిరంలో రోజూ కనీసం వంద ఆటలు జరుగుతాయి. ఈ లెక్కన రూ.50 వేలు బ్యాంకు రోజుకు రూ.1.60 లక్షలు, రూ.లక్ష బ్యాంకునకు రూ.2.40లక్షలు, రూ.2లక్షల స్టేక్‌కు రోజుకు రూ.32 లక్షలు నిర్వాహకుడికి వస్తుంది.
- రూ.50వేలు, రూ.లక్ష బ్యాంకులు ఎక్కువగా ఆడతారు. వీరు రోజులో వంద గేమ్‌లు కచ్చితంగా ఆడతారు. రూ.2లక్షల బ్యాంకు మాత్రం ఆర్థికంగా బలమైన వారు, ప్రజాప్రతినిధులు మాత్రమే ఆడతారు. ఇవి సగటున రోజుకు 50 గేమ్‌లు జరుగుతాయని తెలుస్తోంది.

క్లుప్తంగా

ఆర్టీసీ రీజియన్‌లో సర్వీసుల బదిలీ

- నిషేధిత వస్తువుల అక్రమ రవాణా ఆరోపణల నేపథ్యంలో చర్యలు

అనంతపురంక్రైం: ఆర్టీసీ అనంతపురం రీజియన్‌లో పెద్ద ఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. ఇటీవలి కాలంలో ఆర్టీసీ బస్సుల ద్వారా లిక్కర్, గుట్కా, ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. రీజనల్ మేనేజర్ శ్రీలక్ష్మి ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అనంతపురం నుంచి హైదరాబాదు, బెంగళూరు, నెల్లూరు దిశగా నడుస్తున్న ప్రధాన సర్వీసులను ఇతర డిపోలకు బదిలీ చేసే ప్రతిపాదనను పంపారు. తాజా నిర్ణయం ప్రకారం.. ఈ సర్వీసులు ఇకపై ఉరవకొండ, రాయదుర్గం, తాడిపత్రి డిపోల నుంచి నడుస్తాయి. కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ బస్సులను అక్రమ రవాణా సాధనాలుగా ఉపయోగిస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా చర్యలు ప్రారంభించినట్లు సిబ్బంది మధ్య చర్చ జరుగుతోంది. ప్రయాణికుల భద్రత, సంస్థ ప్రతిష్ట దృష్ట్యా ఈ మార్పులు తప్పనిసరి అయినట్లు కార్మికులు స్పష్టం చేశారు. ఇప్పటిదాకా ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడిన వారిపై విచారణ కూడా చేపట్టినట్లు తెలుస్తోంది. ఇకపై ప్రతి డిపోలో సీసీ కెమెరాలు, లగేజీ స్కానింగ్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆలయంలో చోరీ




దొంగలు పగులగొట్టిన హుండీ

కనగానపల్లి: యలకుంట్లలోని పెద్దమ్మస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీ పక్కన పెద్దమ్మస్వామి ఆలయంలోకి అర్ధరాత్రి వేళ దొంగలు చొరబడ్డారు. అమ్మవారి వెండి ఆభరణాలు, హుండీ బయటకు ఎత్తుకెళ్లారు. తర్వాతా గ్రామ శివారులో హుండీ పగులగొట్టి అందులోని నగదు ఎత్తుకుపోయారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి, భక్తులు విషయం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పచ్చనేతలకు ఉపాధి మేత

- పని చేయకుండానే ఖాతాల్లోకి డబ్బులు
- ఇదీ టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు బండి పరుశురాం కక్కుర్తి
- బి.యాలేరులో భార్యాభర్తలిద్దరూ పనులు చేశారని మస్టర్
- ఆత్మకూరు మండలంలో చాలామంది చోటా నాయకులది ఇదే తీరు



ఆత్మకూరు/రాప్తాడు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తెలుగు తమ్ముళ్లకు మేతలా మారింది. వడ్డించేవాడు మనోడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఇబ్బంది ఉండదు అన్న చందంగా ఫీల్డ్ అసిస్టెంట్ మనోడైతే పనులు చేయడం కాదు కదా...ఊరిలో లేకపోయినా సరే పనులు చేసినట్లు మాయ చేసి ఎంచక్కా బిల్లులు జేబుల్లోకి వేసుకోవచ్చు. ఆత్మకూరు మండలం బి.యాలేరులో టీడీపీ అనుబంధ విద్యార్థి సంఘం టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండి పరుశురాం కుటుంబ సభ్యుల పేరుతో జరిగిన అక్రమాలే ఇందుకు నిదర్శనం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీల్డ్ అసిస్టెంట్‌గా మొద్దు రామాంజి బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచి అక్రమాలకు బీజం పడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఇద్దరూ పనులకు వెళ్లారట!

బండి పరుశురాముడు అలియాస్ బండి పరశురాం పేరుమీద జాబ్‌కార్డు (ఏపీ–12–024–014–007/010816) తెచ్చుకున్నాడు. ఈ కార్డు ఆధారంగా బండి పరుశురాముడు, బండి భారతి దంపతులిద్దరూ ఉపాధి హామీ పనులకు వెళ్లినట్లు మస్టర్‌లో నమోదు చేశారు. 2024 ఆగస్టు 5 నుంచి పనులు చేస్తున్నట్లు మస్టర్‌లో నమోదు చేశారు. వ్యవసాయ అనుబంధ పనులు, నీటి వనరుల నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణం తదితర పనులు చేసినట్లు రికార్డు చేశారు. అసలు ఆ పనుల మొహం కూడా వీరు చూడలేదు. అయినా గత నెల (సెప్టెంబరు) 30 వరకు 135 రోజులు వీరు పనులకు వెళ్లినట్లు చూపించారు. రెండు విడతల్లో మొత్తం రూ. 35,462 వారి ఖాతాల్లో జమ చేశారు.

ఊరిలో లేని పరుశురాం కుటుంబం

బండి పరుశురాం కుటుంబం ఊరిలో ఉండరు. అనంతపురంలో నివాసం ఉంటున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా తమ పేర్లు ఎక్కించుకున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. వీరి పేరిట జాబ్‌కార్డ్ ఉందని, వారు పనికి వెళ్లకుండానే మస్టర్‌లో నమోదు చేసి బిల్లులు పెట్టిన విషయం సంబంధిత అధికారులకూ తెలుసు. అయినా నోరు మెదపకుండా ఉండడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు.

- ఇదే విధంగా గ్రామంలో టీడీపీ కార్యకర్తలు దాసరి అనిల్‌కుమార్, ఈడిగ ఈశ్వరయ్య, ఈడిగ శివయ్య, కాసంశెట్టి రాజేంద్రప్రసాద్, కరిఆవుల పెద్దన్న తదితరులు పనులు చేయకుండానే వారికి బిల్లులు వేశారు. ఆత్మకూరు మండల వ్యాప్తంగా ఇలా టీడీపీ నేతలు పనులు చెయ్యకపోయినా బిల్లులు తమ ఖాతాలకు జమ చేయించుకుంటున్నారు. తమ పేర్లు పెడుతున్న కారణంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు వాటాలు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి.



బండి పరుశురాముడు దంపతులు చేసినట్లు చూపుతున్న పనుల వివరాలు

కక్కుర్తిపడటం సిగ్గుచేటు



“ టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న బండి పరుశురాం ఉపాధి హామీ పనులు చేయకుండా బిల్లులు పొందడం సిగ్గుచేటు. పరశురామ్ అనేవ్యక్తి యాలేరు గ్రామంలోనే ఉండడు. స్థానికంగా లేకపోయినా, పనులు చేయకపోయినా బిల్లులు ఎలా చేస్తారు?

– హేమలత, ఎంపీపీ, ఆత్మకూరు

పనులు చేయకుండానే బిల్లులా?



ప్రస్తుతమున్న ఫీల్డ్ అసిస్టెంట్లందరూ టీడీపీ కార్యకర్తలే. చాలా గ్రామాల్లో పనులు చేయకపోయినా పార్టీ వారికి బిల్లులు వేస్తున్నారు. వచ్చిన బిల్లుల్లో నీకు సగం, నాకు సగం అంటూ ఉపాధి హామీ అధికారులకు వాటాలిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఉపాధి పనుల్లో చాలా అక్రమాలు జరుగుతున్నాయి.

– బాలపోతన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఆత్మకూరు

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో లేని వారికి పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు పెట్టిన విషయం నా దృష్టికి రాలేదు. అలాంటి వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. ఎవరైతే పనులు చేసి ఉంటారో వారి పేర్లు మాత్రమే మస్టర్‌లో నమోదు చేయాలి. వారికే బిల్లులు వేయాలి.

– వెంకటనారాయణ, ఏపీఓ

ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై దాడే



అనంతపురం: ప్రభుత్వ వైఫల్యాలు, నకిలీ మద్యం రాకెట్‌పై కరుస కథనాలు రాస్తుండటాన్ని తట్టుకోలేక సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డి, జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి వేధించడం ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై దాడేనని రాజకీయ, జర్నలిస్టు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు ఖండిస్తున్నారు. పత్రికపై కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలుకుతున్నారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే



ప్రజల ప్రయోజనాల కోసం నిజాలు వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులపై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. సాక్షి మీడియా నిజాలు రాస్తే చంద్రబాబు ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించింది. మీడియాను గుప్పిట్లో పెట్టుకుని అరాచకాలు సృష్టించాలని చూస్తున్నారు. నకిలీ మద్యం, అవినీతి, ప్రజా సమస్యలపై వాస్తవాలను వెలుగులోకి తెస్తూ సాక్షి దిన పత్రిక ప్రజాస్వామ్య బాధ్యతలను నిర్వర్తిస్తోంది. ధైర్యవంతమైన జర్నలిజాన్ని అణచివేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కుట్రపూర్వకంగా కేసులు నమోదు చేస్తోంది. ఇది కేవలం ఒక పత్రికపై దాడి కాదు. మీడియా స్వేచ్ఛపై దాడి.

– అనంత వెంకట్రామి రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

విమర్శ స్వీకరించే ధైర్యముండాలి



ప్రభుత్వానికి ఏమి అవసరమో అది మాత్రమే వినపడాలి అనే ధోరణి సరికాదు. సాక్షి ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డిపై ఏకంగా 11 కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను కాపాడాలి. తప్పుడు కేసులను వెంటనే ఎత్తేయాలి. జర్నలిస్టులు, మీడియా సంస్థలను ఇబ్బంది పెట్టే విధానం మానుకోవాలి. జర్నలిస్టుల గళాన్ని అణచే చర్యలను తక్షణం ఆపాలి.

– వి.రాంభూపాల్, సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు

పచ్చని చెట్లతోనే స్వచ్ఛమైన గాలి

కూడేరు: పచ్చని చెట్లతోనే స్వచ్ఛమైన గాలి (మనం పీల్చే ఆక్సిజన్) లభిస్తుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం కూడేరులో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఎంపీ, కలెక్టర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత భగవతి ఫంక్షన్ హాలు నుంచి పెట్రోల్ బంక్ వరకు విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తర్వాత చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత వర్మీకంపోస్టు ఎరువు తయారు చేశారు.. ఎంత విక్రయించారు.. ఎంత ఆదాయం వచ్చిందని ఆరా తీస్తే అధికారులు సరైన సమాధానం చెప్పక పోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండల అధికారులతో కలిసి కలెక్టర్, ఎంపీ మానవహారంగా ఏర్పడ్డారు. పరిశుభ్రత పాటిస్తామని, ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పెన్నహోబిలం వద్ద త్వరలో మొక్కలు నాటే ప్రాజెక్ట్ తీసుకురాబోతున్నట్లు చెప్పారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. తర్వాత జాగృతి ఫౌండేషన్ చైర్మన్ పురుషోత్తం అందజేసిన బట్టతో తయారు చేసిన సంచులు, మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, డీపీఓ నాగరాజునాయుడు, జెడ్పీ సీఈఓ శివశంకర్, డ్వామా పీడీ సలీం బాషా, డీఎస్ఓ గురు ప్రభాకర్, డీఆర్‌డీఏ పీడీ శైలజ, డిప్యూటీ ఎంపీడీఓ రాధాకృష్ణ, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఏపీఓ పోలేరయ్య, ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.



మొక్కనాటి నీరు పోస్తున్న ఎంపీ లక్ష్మీనారాయణ, కలెక్టర్ ఆనంద్

మార్కెట్‌యార్డులో 'తాళ్ల' పంచాయితీ

- ఎమ్మెల్యే అనుచరులమంటూ కొందరు హల్‌చల్
- తమకు బాధ్యతలివ్వాలని టెండర్‌దారులతో ఘర్షణ
- ఎవ్వరికీ చెప్పలేక మార్కెటింగ్ శాఖ అధికారుల మౌనం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో రెండు రోజులుగా తాళ్ల పంచాయితీ నడుస్తోంది. ప్రతి శని, ఆదివారం నిర్వహించే గొర్రెలు, మేకలు, పొట్టేళ్లు, ఆవులు, గేదెలు, ఎద్దుల సంతల్లో వివిధ రకాల తాళ్లు అమ్ముకునేందుకు ఏటా టెండర్ నిర్వహించి, నిబంధనల మేరకు కోట్ చేసిన వారికి అనుమతులు ఇస్తారు. ఈ క్రమంలో ఈ ఏడాది రామాంజినేయులు అనే వ్యక్తి ఏడాదికి రూ.16.38 లక్షలు చొప్పున మూడేళ్లకు టెండర్ దక్కించుకున్నాడు. ఈ ఆగస్టు నుంచి తాళ్లు అమ్ముకోవడం మొదలు పెట్టాడు. అయితే ఉన్నఫళంగా శుక్రవారం, శనివారం కొందరు వ్యక్తులు స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులమని హల్‌చల్ చేస్తున్నట్లు చెబుతున్నారు. మార్కెటింగ్ ఏడీ, గ్రేడ్–2 సెక్రటరీ, ఇతర అధికారులతో పాటు టెండర్ దక్కించుకున్న వ్యక్తులతో ఘర్షణకు దిగినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. తాళ్లు అమ్ముకునే బాధ్యత తమకే అప్పగించాలంటూ రెండు రోజులుగా ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. నిబంధనల మేరకు సాధ్యం కాదని చెబుతున్నా.. తాము కూడా తాళ్లు అమ్ముకుంటామని శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత ఆవరణలో కాసేపు హడావుడి చేసినట్లు తెలిపారు. అయితే టెండర్ దక్కించుకున్న వాళ్లు ఏమాత్రం తగ్గకుండా తాము కూడా మార్కెటింగ్ అధికారులు, పోలీసులతో పాటు మంత్రి పయ్యావుల దృష్టికి తీసుకెళతామని హెచ్చరించడంతో సమస్య ప్రస్తుతానికి సద్దుమణిగినట్లు చెబుతున్నారు. తాము పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించి టెండర్ దక్కించుకుని తాళ్ల వ్యాపారం చేసుకుంటుంటే.. జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్ యార్డు గేటు బయట, పరిసర ప్రాంతాల్లో తాళ్లు అమ్ముకోవడం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. తాళ్ల అమ్మకం పంచాయితీపై మార్కెటింగ్ శాఖ అధికారులు ఎవరికీ గట్టిగా చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నట్లు చెబుతున్నారు. వీరి మధ్య పోటీ కారణంగా ఈసారి తాళ్ల టెండర్ గరిష్ఠంగా రూ.16.38 లక్షలు పలికినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.



శనివారం జీవాల సంతలో టెండర్‌దారులు ఏర్పాటు చేసుకున్న తాళ్ల షాపు

ఆర్టీసీలో ఐటీఐ విద్యార్థులకు అప్రెంటిస్ అవకాశాలు

అనంతపురం క్రైం: ఆర్టీసీలో ఐటీఐ విద్యార్థుల కోసం అప్రెంటిస్ నియామకాలు ప్రకటించింది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల డిపోలలో వివిధ ట్రేడ్లలో అప్రెంటిస్ ఖాళీలు భర్తీ చేయనున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు అక్టోబర్ 25 నుంచి నవంబర్ 8 వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆర్టీసీ వెబ్‌సైట్(డబ్లూడబ్లూడబ్లూ.ఏపీపీఆర్‌టీఎన్‌టీఐసీఈఎస్‌హెచ్‌ఐపీఇండియా.జీవోవి.ఇన్)లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థుల ఇంటర్వ్యూలు నవంబర్ 8న సంబంధిత ప్రాంతీయ కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు ఫీజు రూ.118గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అప్రెంటిస్ కాలంలో అభ్యర్థులు ఇతర ఉద్యోగాలకు దరఖాస్తు చేయరాదని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగంలో ఇద్దరికి చోటు

అనంతపురం: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగంలో ఇద్దరికి చోటు దక్కింది. జిల్లా మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా గొల్ల రాధ, జనరల్ సెక్రటరీగా ఉప్పుతోళ్ల రాజేశ్వరిని నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ కీలక విభాగంలో చోటు కల్పించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

హాకీ, బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

అనంతపురం కార్పొరేషన్: ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో అండర్– 14 హాకీ, బాస్కెట్‌బాల్ జట్లకు క్రీడాకారుల ఎంపిక జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్టేడియంలో శనివారం జరిగాయి. ఎంపికైన జట్లు త్వరలో జరగబోయే అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటాయని కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.


హాకీ

అండర్– 17 బాలురు: సంతోష్, సాదిక్, కుమార్, బాలరాజు, వెంకటేష్, నవదీప్, విక్రాంత్, ఉదయ్ కుమార్, మనోజ్, మేఘనాథ్, పోతులయ్య, బీమా, సాత్విక్, గోవర్ధన్, అశోక్, బాలాజీ, జగదీష్, సాదిక్, రిహాన్.

బాలికలు: మిరాంబి, జ్యోతి, దివ్య, నవ్యశ్రీ, శ్రీవల్లి, లాస్యరెడ్డి, ప్రేమలత, మోక్షిత, నందిని, కీర్తన, యశస్విని, ఉషశ్రీ, అనురాధ, దీపిక, స్వాతి, జగదీశ్వరి, సమీర, మల్లిక.

అండర్ – 14 బాలికలు:సనా, గుణశ్రీ, శ్రీరూనికా, శ్రీలేఖ, ఇందు, అర్చన, మాన్య, ప్రియాంక, నాగమణి, మానస, హేమ, హిమబిందు, కావ్యశ్రీ, వర్షిని, మోక్షిత, భానుశ్రీ, స్వాతి, నందలక్ష్మి.

బాలురు:వరుణ్, లక్ష్మీనారాయణ, శివశంకర్, సునీల్, ఉదయ్‌కుమార్, బాబాఫరీద్, అభినాష్, మణికుమార్ రాజు, మనోజ్, సాదిక్, జయంత్, పవన్, విక్కీ, అజయ్, నవీన్, రవిజేత, మురళి, భార్గవ్.



అండర్ -14 బాలికల బాస్కెట్‌బాల్ జట్టు

బాస్కెట్‌బాల్

అండర్ –17 బాలురు: సాయిసాత్విక్ వర్ధన్, కౌశిక్, లచ్చి, యశ్వంత్, కార్తీక్ నాయక్, సంతోష్, మనీష్, ఉజ్జనేశ్వర్, యేసుర్, భరత్ సింహారెడ్డి, హేమంత్, నవీన్‌కుమార్ రెడ్డి.

బాలికలు:ధన్వి, శ్రావ్య, వాణిశ్రీ, మన్విత, శరణ్య, శ్రావణి, వర్షిని, సంధ్యా, మహిత, రచన, జయలక్ష్మి, ఓం శ్రీజోత్స్న.

అండర్ –14 బాలురు: యోగేశ్వర్, మిథిల్, సత్య, షణ్ముక, గౌతమ్, అభిజ్ఞారాం, రాఘవ్, వరుణ్య కుమార్‌రెడ్డి, ప్రశాంత్, భావిష్‌రెడ్డి, తరుణ్‌రాజు, హితేష్‌చౌదరి.

బాలికలు: హర్షిత, సిద్రహ, పూజిత, అమృత, ప్రియదీప్తి, కారుణ్య, అరీనా, భావన, పల్లవి, ఆఫ్రీన, ప్రజ్వల, సోనాక్షి.

విద్యార్థి బలవన్మరణం

మడకశిర రూరల్: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపం చెందిన విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈచలెడ్డి గ్రామానికి చెందిన నాగరాజుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అనారోగ్యంతో గతంలోనే చనిపోయాడు. చిన్న కుమారుడు మనోజ్ (15) బుళ్లసముద్రం ఉన్నతపాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండటంతో బాగా చదువుకోవాలని, పాఠశాలకు సక్రమంగా వెళ్లాలని తల్లిదండ్రులు శుక్రవారం రాత్రి మందలించారు. మనస్తాపానికి గురైన మనోజ్ అదే రోజు రాత్రి నిద్రించడానికని గదిలోకి వెళ్లి ఉరివేసుకున్నాడు. ఉన్న ఇద్దరు కుమారులు ఊహించని విధంగా చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రాహుల్ డబుల్ సెంచరీ..



ఎస్వీ రాహుల్ (203 నాటౌట్)



ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (94 పరుగులు)

అనంతపురం కార్పొరేషన్: ఆంధ్ర ఆటగాడు ఎస్వీ రాహుల్ డబుల్ సెంచరీతో చెలరేగాడు. వికెట్ కీపర్ ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 630/6 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం ఢిల్లీ జట్టు ఆటముగిసే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసి ఎదురీదుతోంది. వివరాలిలా ఉన్నాయి. సీకే నాయుడు ట్రోఫీ అండర్–23లో భాగంగా శనివారం అనంత క్రీడా గ్రామంలో మూడో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 470/4తో ప్రారంభించిన ఆంధ్ర జట్టు స్కోర్ వేగాన్ని చకచకా పెంచింది. ఎస్వీ రాహుల్, వికెట్ కీపర్ ప్రసాద్‌లు ఢిల్లీ బౌలర్లను ఓ ఆట ఆడుకున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా బౌండరీలు బాదారు. ఈ క్రమంలో ఎస్వీ రాహుల్ 386 బంతుల్లో 18 ఫోర్లు, 2 భారీ సిక్సర్ల సహాయంతో 203 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ ప్రసాద్ కూడా అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. 91 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్ల సహాయంతో 94 పరుగులు చేశాడు. రాహుల్, ప్రసాద్‌లు ఆరో వికెట్‌కు 146 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఢిల్లీ బౌలర్లలో దేవ్ లక్ర, మన్నన్ భరద్వాజ్, యుగల్ షైనీ చెరి రెండు వికెట్లు పడగొట్టారు.

ఢిల్లీ 200/5

ఆంధ్ర బౌలర్ల ధాటికి ఢిల్లీ జట్టు తొలి ఇన్నింగ్స్ ఆటముగిసే సమయానికి 63 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసింది. జట్టులో ఆల్‌రౌండర్ దేవ్ లక్ర 91 పరుగుల(13 ఫోర్లు, 2 సిక్సర్లు)తో నాటౌట్‌గా నిలిచాడు. యుగల్ షైనీ 44 పరుగులు చేశాడు. ఆంధ్ర బౌలర్ ఆదిత్యరెడ్డి 3/39 వికెట్లు తీసుకుని ఢిల్లీని కట్టడి చేశాడు.

బాలికపై అత్యాచారయత్నం

కదిరి అర్బన్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి అత్యాచారయత్నం చేశాడు. బాలికకు సదరు వ్యక్తి గత కొన్ని రోజులుగా సెల్‌ఫోన్‌లో నీలిచిత్రాలు చూపిస్తూ.. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఈ అఘాయిత్యానికి యత్నించాడు. అదే సమయంలో వచ్చిన బాలిక అక్క గమనించి గట్టిగా కేకలు వేసింది. అనంతరం తండ్రికి విషయం తెలిపింది. అనంతరం బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

శిక్షణ అంశాలు ఆచరణలో పెట్టాలి

రాయదుర్గంటౌన్: శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను పాత్రికేయులు ఆచరణలో పెట్టి వృత్తికి వన్నె తేవాలని సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు సూచించారు. రాయదుర్గంలోని ఓ ఫంక్షన్ హాలులో సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన 'గ్రామీణ విలేకర్ల పునశ్చరణ తరగతులు' శనివారంతో ముగిసాయి. శిక్షణకు సురేష్ కుమార్, సుబ్బారావుతోపాటు చివరి రోజు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. జర్నలిస్టులు నైపుణ్యంతో ఎదగాలని, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. అనంతరం శిక్షణ పొందిన జర్నలిస్టులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అయూబ్, శిక్షణ తరగతుల నిర్వహణ కమిటీ ప్రతినిధులు కమలాక్షుడు, గురు రాఘవేంద్రప్రసాద్, ఖాజా హుస్సేన్, ఆవుల మనోహర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన విలేకర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ సురేష్ కుమార్, ఎమ్మెల్యే కాలవ

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వాల్మీకి జయంత్యుత్సవం



బోనాలు ఎత్తుకున్న మహిళలు

ఆత్మకూరు: మహర్షి వాల్మీకి జయంత్యుత్సవాన్ని శనివారం ఆత్మకూరులో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి కోసం బోనాలు ఎత్తిన మహిళలు ఊరేగింపుగా వాల్మీకి విగ్రహం వద్దకు వచ్చారు. అనంతరం వాల్మీకి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం వాల్మీకి మహర్షి చిత్రపటంతో పెద్ద ఎత్తున గ్రామోత్సవం నిర్వహించారు.

మార్కెట్‌లోకి బొలెరో 'నియో', 'ది బాస్'



వాహనాలను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: మహీంద్రా బొలెరో నియో, బొలెరో ది బాస్ ఎడిషన్ కార్లు మార్కెట్‌లోకి విడుదలయ్యాయి. శనివారం ఎంజీబీ మొబైల్స్ షోరూంలో సీఈఓ ఆదిత్య మాచాని చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాలుగు రంగుల్లో బొలెరోలు అందుబాటులో ఉన్నాయని, ఎక్స్ షోరూం ధర రూ. 7.89 లక్షలుగా ఉందని వివరించారు. బొలెరో నియో ఎడిషన్ 9 రంగుల్లో లభిస్తుందని, రూ. 8.49 లక్షలు ఎక్స్ షోరూం ధర అని తెలిపారు.

మద్యం దుకాణంలో తనిఖీలు

అనంతపురం సెంట్రల్: నగరంలో శారదా నగర్‌లోని రుద్ర వైన్‌షాపులో ఎక్సైజ్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు జయచంద్ర, జాకిర్ పలు రికార్డులను పరిశీలించారు. నకిలీ మద్యంపై ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిల్‌ను సులభంగా పరిశీలించుకోవచ్చునని, ప్రతి ఒక్కరూ బాటిల్ కొనుగోలు చేసిన తర్వాత పరిశీలన చేయాలని సూచించారు. ఏమాత్రం తేడా ఉన్నా ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

అభినందన



శశిధర్‌ను సత్కరిస్తున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం: ఏపీపీఎస్సీ నూతన చైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ సి. శశిధర్‌ను జేఎన్‌టీయూ (ఏ)వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అభినందించారు. జేఎన్‌టీయూ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ అయిన సి. శశిధర్ పీహెచ్‌డీ వైవా నిమిత్తం శనివారం వర్సిటీలో పర్యటించారు. ఈ నేపథ్యంలో వీసీ సుదర్శనరావు ఆయనను సత్కరించారు. కాగా, జేఎన్‌టీయూ (ఏ)లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించిన ప్రొఫెసర్ వై. వెంకట్రామి రెడ్డి 2005లో ఏపీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. తాజాగా ఇదే కళాశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ సి. శశిధర్ ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమితులు కావడం గమనార్హం.

భద్రతా ప్రమాణాలు పాటించాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం సెంట్రల్: నగరంలో శ్రీనగర్ కాలనీలో సమీపంలో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ కేంద్రం వద్ద భద్రతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. శనివారం రాత్రి టపాసుల విక్రయ ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే నగరంలో ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. నగరంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణ, రెగ్యులేషన్ చర్యలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు వెంకటేష్ నాయక్, జగదీష్ పాల్గొన్నారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

అనంతపురం సెంట్రల్: నగరంలో వేర్వేరుచోట్ల ఇద్దరు యువతులు అదృశ్యమయ్యారు. వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... నగరంలో గఫూర్‌కాలనీలో నివాసముంటున్న రమేష్ కుమార్తె దాసరి శ్రీసాయి శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎస్ఆర్ఐటీ కళాశాలలో బీటెక్ చదువుతోంది. దీంతో తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే వేణుగోపాల్ నగర్‌లో నివాసముంటున్న అంజాద్ బాషా కుమార్తె ముబాసిర శుక్రవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాధిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.8 వేలు కొట్టు...లైసెన్స్ పట్టు

- టపాసుల విక్రయదారుల నుంచి ముక్కుపిండి వసూళ్లు
- ఓ రెవెన్యూ ఉద్యోగి కీలకపాత్ర



దుకాణాల కేటాయింపునకు లాటరీ తీస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: దీపావళిని పురస్కరించుకుని నగరంలో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక దుకాణాల నిర్వాహకుల నుంచి ఒకవైపు అధికార పార్టీ నేతలు, మరోవైపు రెవెన్యూ అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక్కో దుకాణం ఏర్పాటుకు టీడీపీ చోటా నేతలకు రూ.40 వేలు కప్పం కట్టాల్సి వస్తోంది. ఇందులో పైసా తగ్గినా ఒప్పుకోవడం లేదు. దీనికితోడు లైసెన్స్ మంజూరుకు రెవెన్యూ అధికారులు కూడా ముక్కుపిండి వసూళ్లు చేయడంతో వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

ఒక్కో లైసెన్సీ నుంచి రూ. 8 వేలు

నగరంలో ఏర్పాటు చేసే దుకాణదారులు తాత్కాలిక లైసెన్సుల కోసం రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీఓ) కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులను రాష్ట్ర పన్నుల శాఖకు పంపుతారు. అక్కడ ఒక్కో దుకాణదారుడు సాధారణ పన్ను (క్యాజువల్ ట్యాక్స్) రూ. 25 వేలు చెల్లించి అనుమతులు తీసుకోవాలి. అలాగే అగ్నిమాపకశాఖ నుంచి చలానా పొందాలి. కార్పొరేషన్, పంచాయతీ కార్యాలయాలకు పన్ను చెల్లించి ఉండాలి. ఇవన్నీ పరిశీలించిన తర్వాత పోలీసు, తహసీల్దార్లు విచారించాక ఆర్డీఓ లైసెన్సును మంజూరు చేస్తారు. ఇక్కడే కొందరు ఉద్యోగులు చక్రం తిప్పారు. గతంలో అనంతపురంలో పని చేసిన ఓ ఉద్యోగి కీలకపాత్ర పోషించాడనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఒక్కో లైసెన్సీ నుంచి రూ. 8 వేలు వసూలు చేశారు. ఈ లెక్కన రూ. 9.5 లక్షల వరకు దండుకున్నట్లు తెలిసింది. ఇదికాకుండా 'గిఫ్ట్ ప్యాక్'లు కూడా ఇవ్వాలంటూ షరతు పెట్టినట్లు సమాచారం. తప్పని పరిస్థితుల్లో అంగీకరించాల్సి వచ్చిందని కొందరు వ్యాపారులు వాపోయారు. ఈ వ్యవహారం రెవెన్యూ ఉద్యోగులు, టపాకాయల వ్యాపారుల్లోనూ హాట్‌టాపిక్‌గా మారింది. కాగా శనివారం ఉదయం స్థానిక కృష్ణకళామందిరంలో వ్యాపారుల సమక్షంలో లాటరీ తీసి దుకాణాలు కేటాయించారు. ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లాటరీ కార్యక్రమం సాగింది.

నాకు సంబంధం లేదు

నాపేరు చెప్పి వసూళ్లు చేస్తే నాకేమి సంబంధం. ఇచ్చేవారికి ఉండాలి. కలెక్టర్ పేరు కూడా చెప్పి వసూళ్లు చేస్తుంటారు. అది కలెక్టర్‌కు సంబంధమా? దారివెంట పోయేవారు వచ్చి ఆర్డీఓ పేరు చెబితే ఎలా ఇస్తారు. మేము ఎవరినీ ఒక్క రూపాయి కూడా అడగలేదు. ఎవరైనా వసూళ్లు చేసి ఉంటే వారు నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

\- కేశవనాయుడు, ఆర్డీఓ

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మొక్క నాటుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం టవర్‌క్లాక్: ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణంలో 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తొలుత గాంధీ విగ్రహం వద్ద అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు.

గ్రంథాలయంలో 'స్వచ్ఛ భారత్'

అనంతపురం కల్చరల్: కేంద్ర గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ కార్యదర్శి రమా ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది, పాఠకులు గ్రంథాలయ ఆవరణంలో పిచ్చిమొక్కలను తొలగించడమే కాకుండా పలు మొక్కలు నాటారు. డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందు పాల్గొన్నారు.

కాలుష్య రహిత నగరమే లక్ష్యం

అనంతపురం క్రైం: నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. శనివారం స్థానిక హరిహర ఆలయం సమీపంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పర్యావరణ పరిరక్షణకు యువత పాటు పడాలని కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈఈ షాకీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పెంపొందిద్దాం

అనంతపురం టౌన్: మొక్కలు నాటి పర్యావరణాన్ని పెంపొందిద్దామని అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ అన్నారు. శనివారం బళ్లారిరోడ్డులోని ఏపీఐఐసీ కార్యాలయంలో సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక వాడల్లో చెట్లుంటేనే అందంగా ఉంటుందన్నారు. అనంతరం రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి సమీపంలోని ఏపీఐఐసీ పార్కులో పరిశ్రమలను పరిశీలించారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ నాగకుమార్, జీఎం శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, మేనేజర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పరక పట్టిన డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం సిటీ: జిల్లా విద్యాశాఖాధికారి కడప ప్రసాద్‌బాబు పరకపట్టారు.చెత్తాచెదారాన్ని ఊడ్చారు. శనివారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ఆవరణంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా డీఈఓ ప్రసాద్ బాబు, తమ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్లు కడప మునీర్ ఖాన్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు ఆదినారాయణ, జగదీశ్, లక్ష్మీనారాయణ, ఏఎస్ఓ బోయ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్, ఉద్యోగులతో కలసి కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు.

మాటల గారడీతో మోసం చేయొద్దు

- ఎమ్మెల్యే దగ్గుపాటి తీరుపై మేయర్ వసీం ధ్వజం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: మాటల గారడీతో ప్రజలను మోసం చేయొద్దంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌పై మేయర్ వసీం మండిపడ్డారు. శనివారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. దగ్గుపాటి ప్రసాద్ మూడు నెలలకోసారి టిడ్కో ఇళ్ల వద్దకు వెళ్లి ఆరు నెలల్లో నిర్మాణాలు పూర్తి చేస్తానని చెబుతుంటారని, కానీ ఇప్పటివరకు ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదన్నారు. మార్చి లోపు ఇళ్లు పూర్తి చేస్తే తామే సన్మానిస్తామన్నారు. నగర అభివృద్ధికి కౌన్సిల్ ఆమోదించిన పనులను సైతం అధికార పార్టీ నేతలు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాలు, ప్రైవేట్ భూములు ఆక్రమించి, దౌర్జన్యాలు ఎవరు చేస్తున్నారు.. నగర అభివృద్ధిని అడ్డుకుంటున్నది ఎవరో ప్రజలు తెలుసుకున్నారన్నారు. ప్రతి కాలనీలో రోడ్లు పాడయ్యాయని చెప్పారు. అయినా అటు వైపు కన్నెత్తి చూసేందుకు కూడా ఎమ్మెల్యేకి సమయం లేదన్నారు. కౌన్సిల్‌లో పలు పనులను ఆమోదిస్తామని, వీటితో పాటు గతంలో ఆమోదించిన పనులు పూర్తి చేయించే బాధ్యతను ఎమ్మెల్యే దగ్గుపాటి తీసుకోవాలని సూచించారు. 'నోరు తెరిస్తే మాపై విమర్శలు చేసే ఎమ్మెల్యే... మా పరిపాలనలో అనంత రూపురేఖలు ఎలా మారాయో ప్రజలను అడిగితే చెబుతారు' అని అన్నారు. 18 నెలల్లోపే వంతెన నిర్మాణం, రూ.1,200 కోట్లతో నగరంలో ప్రధాన రహదారుల నిర్మాణాలు పూర్తి చేయించామన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ప్రజా సేవలో అంకిత భావం తమకు అలవడిందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు నరసింహులు, ఇషాక్, కమల్ భూషణ్, శ్రీనివాసులు, నాయకులు చింతకుంట మధు, సుబ్బయ్య, నాగార్జున రెడ్డి, రామచంద్ర, కుళ్లాయి స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్

రాప్తాడు: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, ఏ అంశాన్నైనా సైన్స్‌లో ముడిపెట్టి చూడాలని మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ సలహాదారుడు డాక్టర్ ఎం.గేయానంద్ సూచించారు. జేవీవీ రాప్తాడు మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాల స్థాయి చెకుముకి సైన్సు సంబరాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గేయానంద్ మాట్లాడుతూ.. జీవితానికి నష్టం కలిగించే ఆచారాలు, మూఢ నమ్మకాలను వ్యతిరేకిస్తూ ప్రయోగానికి తట్టుకొని నిలబడగలిగే నిజమైన వాటిని మాత్రమే జన విజ్ఞాన వేదిక ప్రచారం చేస్తుందన్నారు. విద్యార్థులు కూడా ఇతరులు చెప్పిన ప్రతి విషయాన్ని నమ్మాల్సిన అవసరం లేదని, శాస్త్రీయ దృక్పథంతో ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎంఈఓ-2 కుల్లాయప్ప మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సైన్స్‌తో కూడిన శాస్త్రీయ భావాలను అలవర్చుకోవాలన్నారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో 9 పాఠశాలలకు చెందిన 1,050 మంది విద్యార్థులు పాల్గొన్నారని వెల్లడించారు. అనంతరం చెకుముకి ప్రశ్నా పత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వీర రాజు, రాష్ట్ర కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, మండల నాయకుడు శాంతరాజు, ఉపాధ్యాయులు లక్ష్మన్న, రోజా రమణి, సరస్వతి, గ్రేస్, అంజనా దేవి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. రుక్మిణీ కల్యాణం

అనంతపురం కల్చరల్: చాతుర్మాస దీక్షల్లో భాగంగా సాయిట్రస్టు ఆధ్వర్యంలో శనివారం తపోవనంలోని శ్రీశివశక్తి సాయి దేవాలయంలో రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆశ్వీజంలో వచ్చిన బహుళ ద్వాదశి సందర్భంగా ప్రముఖ వేదపండితులు దేవరకొండ బాలాజీ శర్మ కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌సాయికుమార్ మాట్లాడుతూ చాతుర్మాసాలలో వచ్చే 8 ద్వాదశిలలో 8 మంది దేవతామూర్తుల కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు రాఘవేంద్ర, దేవేంద్ర పాల్గొన్నారు.

పేదల నడ్డి విరిచిన మోదీ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్

అనంతపురం అర్బన్: నిత్యావసర వస్తువులు, ఔషధాలు, ఇలా అన్నింటిపైనా జీఎస్టీ విధించి ప్రధాని మోదీ పేదల నడ్డి విరిచారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీఎస్టీ రూపంలో ఎనిమిదేళ్లుగా వేల కోట్ల రూపాయలను ప్రజల నుంచి వసూలు చేశారన్నారు. తామేదో గొప్ప పనిచేసినట్లు ఇప్పుడు సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అంటూ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. పెట్రో ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకొస్తే రవాణా చార్జీల భారం తగ్గుతుందని, తద్వారా నిత్యావసర వస్తువుల ధరలు కూడా ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు. సమావేశంలో నాయకులు జాఫర్, మల్లికార్జున, రామకృష్ణ, శ్రీరాములు, పద్మావతి, రమణయ్య, బండి రామకృష్ణ పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాల యుద్ధం బుక్‌లెట్ విడుదల

అనంతపురం అర్బన్: ట్రంప్ టారిఫ్ టెర్రరిజం, మోదీ లొంగుబాటుకు వ్యతిరేకంగా సీపీఎం దేశవ్యాప్త క్యాంపెయిన్‌కు పిలుపునిచ్చిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప చెప్పారు. అందులో భాగంగా జిల్లా ప్రజలను చైతన్యం చేసేందుకు కార్యక్రమాలు చేపడతామన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ రూపొందించిన "భారత్‌పై ట్రంప్ సుంకాల యుద్ధం" బుక్‌లెట్‌ను శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ ట్రంప్ విధిస్తున్న సుంకాలు మన దేశ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థితిలో దేశ యువత భవిష్యత్తును కాపాడాల్సిన మోదీ ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందని విమర్శించారు. మోదీ, చంద్రబాబు లాంటి నేతలను ప్రజలు ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, నాగమణి పాల్గొన్నారు.

అద్భుతంగా అభినయించి.. ఆలోచింపజేసి



నాటకం ప్రదర్శిస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: చిన్నారులే ప్రధాన పాత్రధారులుగా సాగిన 'డొక్కా సీతమ్మ' నాటకం ఆహూతులను ఆలోచింపజేసింది. ఆరభి యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక లలితకళాపరిషత్తు వేదికగా నాటక ప్రదర్శన జరిగింది. నంది అవార్డుల గ్రహీత ఆముదాల సుబ్రమణ్యం దర్శకత్వం వహించిన నాటకంలో చిన్నారులు తనూశ్రీ, నేత్ర, అక్షయ, సాత్విక, బబిత తదితరులు హావభావాలను అద్భుతంగా పలికించి అలరించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన డీఆర్వో మలోల, అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి, ఆచార్య సుధాకరబాబు, ఘంటసాల రామయ్య, నాటక సమర్పకులు సుజాత అశోక్ తదితరులు మాట్లాడుతూ చిన్నారుల్లో ఎంతో ప్రతిభ ఉంటుందని, దానిని వెలికితీయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ రంగస్థల నటులు సోమిరెడ్డి, శ్రీరామరెడ్డి, కుల్లాయప్ప, శ్రీనివాసులు, లోకేష్ పాల్గొన్నారు.

కూటమి పాలన అంతా దోపిడీనే

- ఎంపీపీల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సుబ్బర హేమలత మండిపాటు



మాట్లాడుతున్న సుబ్బర హేమలత

ఆత్మకూరు: "కూటమి పాలనలో అంతా దోపిడీనే.. సంక్షేమ పథకాల పేరుతో ఆ పార్టీ కార్యకర్తలకు దోచిపెడుతున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు కూడా టీడీపీ నేతల సేవలో తరిస్తున్నారు. చివరకు ఉపాధి హామీ కూలీల ఖాతాల్లో జమ చేయాల్సిన బిల్లులను టీఎన్ఎస్ఎఫ్ నేత అకౌంట్‌లో వేశారు. ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉంటుందా" అని ఎంపీపీల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సుబ్బర హేమలత ధ్వజమెత్తారు. శనివారం ఆమె వైఎస్సార్ సీపీ మహిళా విభాగం మండల కన్వీనర్ మంజులతో కలిసి స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ అధికార టీడీపీ నేతలు తమ ఆదాయం కోసం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. చివరకు మద్యాన్ని కల్తీ చేసి ప్రజల ప్రాణాలు తీస్తున్నారన్నారు. మరోవైపు ప్రభుత్వ అధికారులు టీడీపీ నేతల చేతుల్లో తోలుబొమ్మలుగా మారారని మండిపడ్డారు. ప్రొటోకాల్ కూడా పూర్తిగా విస్మరించారన్నారు. కూలీల కడుపు నింపాల్సిన ఉపాధి హామీ పథకం టీడీపీ నేతల బొజ్జలు నింపుతోందని హేమలత ఆరోపించారు. అసలు ఉపాధి హామీ పనులకే వెళ్లని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్ బి.యాలేరులో తన పేరిట, తన భార్య పేరుతో ఉపాధి హామీలో దొంగ బిల్లులు చేయించుకున్నారన్నారు.

ఎస్వీఐటీలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

రాప్తాడు: హంపాపురం సమీపంలోని ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఉల్లాసంగా సాగింది. విద్యార్థులు ఆటపాటలతో అందరిలోనూ ఉత్సాహం నింపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కళాశాల ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ... తమ కళాశాలలో ర్యాగింగ్‌కు చోటులేదన్నారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలగాలన్నారు. కరస్పాండెంట్ వి.బీ.ఆర్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థులంతా ఒక లక్ష్యం నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ విష్ణువర్దన్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీలోకంలో ధ్రువతారలు 'ఆ త్రిమూర్తులు'

అనంతపురం సిటీ: సాహితీలోకంలో విశ్వనాథ సత్యనారాయణ, రావూరి భరద్వాజ, చిలుకూరి దేవపుత్రలు ధ్రువతారలుగా వెలుగొందారని ప్రముఖ రచయిత కల్లూరి ఆనందరావు పేర్కొన్నారు. కమలానగర్‌లోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో తెలుగు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ, శ్రీసాయి డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సాహితీవేత్తల వర్ధంతి సభ శనివారం నిర్వహించారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, కళారత్న రావూరి భరద్వాజ, విశాలాంధ్ర స్వర్ణోత్సవ సాహితీ పురస్కార గ్రహీత చిలుకూరి దేవపుత్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమానికి ప్రముఖ రచయిత కల్లూరి ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.దామోదర్‌రెడ్డి, తెలుగు వెలుగు సంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి, కార్యదర్శులు అల్తాఫ్, సుబ్బరాయుడు, సాహితీ మిత్రుడు పరమేశ్వరరావు, ఆశ్రయ అనాథాశ్రమ నిర్వాహకుడు ఎర్రగుంట కృష్ణారెడ్డి, కేఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ లక్ష్మణరావు శ్రమదానం

ఆత్మకూరు: 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బందితో కలిసి చీపురు పట్టి శ్రమదానం చేశారు.

'చదవడానికి పంపిస్తే చంపేస్తారా?'

అనంతపురం సిటీ: పిల్లలను ప్రాణంగా చూసుకోవాల్సిన పాఠశాలల సిబ్బంది అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ ప్రాణాలు తీస్తుంటే చూస్తూ ఊరుకోవాలా అంటూ ఏఐఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. అనంతపురంలోని సమగ్ర శిక్ష కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ మాట్లాడుతూ ఇటీవల బ్రహ్మసముద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి చందన అర్ధరాత్రి గుండె నొప్పి, ఆయాసంతో బాధపడుతుండగా సహచర విద్యార్థినులు కేజీబీవీ సిబ్బందికి తెలిపినా స్పందించలేదని ఆరోపించారు. ఆ తరువాతి రోజు బాలిక పరిస్థితి క్షీణించి మృతి చెందిందన్నారు. విధి నిర్వహణలో బాధ్యతారహిత్యంగా వ్యవహరించిన వారిని తక్షణం అరెస్టు చేసి, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శి మంజునాథ్, ఉమామహేశ్ మాట్లాడుతూ కేజీబీవీల్లో వైఎస్సార్‌సీపీ హయాంలో 80 శాతం పనులు పూర్తి కాగా, కూటమి ప్రభుత్వం మిగిలిన 20 శాతం పనులు కూడా పూర్తి చేయకపోవడం దుర్మార్గమన్నారు. అనంతరం సూపరింటెండెంట్ పెద్దయ్యకు వినతి పత్రం అందించారు. ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యామూర్తికి జీవిత సాఫల్య పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సంధ్యామూర్తి

అనంతపురం కల్చరల్: ప్రపంచ కూచిపూడి దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి రాష్ట్ర వ్యాప్తంగా శాస్త్రీయ నాట్యంలో విశేష సేవలందిస్తున్న వారికి వేర్వేరు విభాగాల్లో జీవిత సాఫల్య పురస్కారాలనందించారు. అందులో భాగంగా నగరానికి చెందిన సీనియర్ నాట్యాచార్యులు సంధ్యామూర్తికి లంక అన్నపూర్ణదేవి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించారు. కూచిపూడి గ్రామంలోని శ్రీబాలా త్రిపుర సుందరి అమ్మవారి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రఖ్యాత నాట్య గురువులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, వేదాంతం రాధేశ్యామ్, డాక్టర్ పశుమూర్తి శ్రీనివాసశర్మ తదితరులు ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు. సంధ్యామూర్తి అనంత వేదికగా నాట్యరంగానికి చేస్తున్న సేవలను కొనియాడారు. శాస్త్రీయ నృత్యం దశదిశలా వ్యాప్తి చెందడంలో సంధ్యామూర్తి కృషి అపారమన్నారు.

డీసీసీబీలో కారుణ్య నియామకం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో శనివారం కారుణ్య నియామకం కింద ఒకరికి స్టాఫ్ అసిస్టెంట్‌గా ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. పామిడి బ్రాంచ్‌లో పనిచేస్తున్న స్టాఫ్ అసిస్టెంట్ రమేష్‌నాయక్ ఈ ఏడాది జూలై 19న విద్యుత్‌షాక్‌తో మరణించారు. దీంతో ఆయన సోదరుడు మోహన్‌నాయక్‌కు అదే స్థాయి ఉద్యోగం కల్పిస్తూ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఈవో కె.సురేఖారాణి, డీజీఎంలు విజయచంద్రారెడ్డి, రామ్‌ప్రసాద్, సుఖదేవబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువు నాణ్యతపై శ్యాంపిల్స్ సేకరణ

అనంతపురం అగ్రికల్చర్: ఫార్ములా-4కు సంబంధించి 19-19-19 ఎరువు నాణ్యత తనిఖీ కోసం స్థానిక సాయి గణేష్ ఆగ్రో ఏజెన్సీస్‌లో శనివారం శ్యాంపిల్స్ సేకరించినట్లు ఏవో వెంకట్‌కుమార్ తెలిపారు. దానికి సంబంధించి 56 కిలోల అమ్మకాలను నిలుపుదల చేశామన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఆత్మకూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఈఓ బాబు సూచించారు. శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు.

'మాకెలా ఆ పనులు అప్పజెబుతారు?'

అనంతపురం క్రైం: తమకు మొక్కలు నాటే పనులను ఎలా అప్పజెబుతారంటూ వాటర్ సప్లయర్స్ కార్మికులు ప్రశ్నించారు. శనివారం ఇన్‌చార్జ్ ఏఈలు దినేష్, చక్రవర్తిలు వాటర్ సప్లయర్స్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ప్రతి వాటర్ సప్లయర్ తమ సచివాలయాల పరిధిలో మొక్కలు నాటాలని సూచించగా.. వాటర్ సప్లయర్స్ కార్మికులు అభ్యంతరం తెలిపారు. ఎస్ఈ చంద్రశేఖర్ కార్మికులతో సమావేశమై.. 'ఈ ఒక్కరోజు మొక్కలు నాటండి, రేపటి నుంచి మీ పనుల్లోకి వెళ్లవచ్చు' అని చెప్పడంతో ఒక్కో సచివాలయం పరిధిలో ఐదు మొక్కలు నాటేందుకు కార్మికులు ఒప్పుకున్నారు.

సూర్యఘర్ యోజన సువర్ణావకాశం

అనంతపురం టౌన్: విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు వినియోగదారులకు ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం సువర్ణ అవకాశమని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ అన్నారు. శనివారం బళ్లారి రోడ్డులోని డీ5 సెక్షన్ పరిధిలో జీఎస్టీ 2.0, ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ జీవీ రమేష్, ఏడీలు శ్రీనివాసులు, చంద్రశేఖర్, రామకృష్ణ, ఏఈలు రవీంద్రప్రసాద్, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపరాదు

అనంతపురం మెడికల్: లింగ వివక్ష చూపరాదని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని గైనిక్ వార్డులో బాలింతలు, గర్భిణులకు బాలికల ప్రాముఖ్యతను ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ తెలియజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ సుచిత్రశౌరీ, డెమో నాగారాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి మతిస్థిమితం లేని మహిళ

ఆత్మకూరు: కట్నేకాలువలోని ఓ ఆశ్రమంలో ఉంటూ తప్పిపోయిన గౌరమ్మను పోలీసులు తిరిగి ఆశ్రమానికి చేర్చారు. గౌరమ్మ శనివారం ఉదయం తప్పిపోయింది. నిర్వాహకుడు కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు సనప గ్రామం వద్ద ఎస్ఐ లక్ష్మణరావు, కానిస్టేబుళ్లు పవన్, హోంగార్డు జైసింహ ఆ మహిళను కనుక్కున్నారు. తిరిగి ఆశ్రమానికి తీసుకువెళ్లి అప్పగించారు.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
ఆదివారం ॥ 19-10-2025



● నరక చతుర్దశి

చెడును నరికేసి... మంచిని వెలిగించి!



ఏదైనా శుభసంఘటన జరిగినప్పుడు కాని, ఎవరైనా మహానుభావులు పుట్టినప్పుడు కాని పండుగలు, వేడుకలు, సంబరాలు చేసుకుంటారు. కాని, ఈ సందర్భంలో ఒకరు చనిపోతే అతడి పేరు మీద పండగ చేసుకోవటం జరుగుతోంది. అతడి చావు ఎందుకంతగా సంతోషప్రద మయిందంటే.... నరకుడు అజ్ఞానానికి, పీడనకు, హింసకు ప్రతీక. నరకం అంటే దుర్గతి. అది కలవాడు నరకుడు. అంటే చెడు నడత కలవాడు. ఆ చెడు తన కుమారునిలో ఉందన్న కారణంగానే అతడి సంహారానికి కారణమయింది తల్లి సత్యభామ. తనలా మరే తల్లీ ఎవరి గర్భశోకానికీ కారణం కాకూడదన్న కోరికతో తన కుమారుడి పేరు శాశ్వతంగా నిలిచి పోయేలా వరం కోరుకుంది. అందుకే శ్రీకృష్ణుడు అతడి పేరు మీదుగానే భవిష్యతులో అందరూ 'నరక చతుర్దశి' జరుపుకుంటారని వరమిచ్చాడు.

హిరణ్యాక్షుడు లోకానికి ఉపద్రవంగా భూదేవిని చుట్టచుట్టి సముద్రంలో ముంచినప్పుడు విష్ణుమూర్తి వరాహావతారమెత్తి, ఆ రాక్షసుని సంహరించి భూదేవిని ఉద్ధరించాడు. ఆ సందర్భంగా భూదేవికి విష్ణుమూర్తి వరప్రసాదం వల్ల భీముడనే పుత్రుడు జన్మించాడు. అతనే దుర్మార్గుడైన నరకాసురునిగా పేరొందాడు. నరకుడు ప్రాగ్జ్యోతిషపురం రాజధానిగా కామరూప రాజ్యాన్ని పాలిస్తూ ఉండేవాడు. భూమాత తన కుమారుని రాక్షసత్వానికి దూరంగానే పెంచింది. దురదృష్టవశాత్తు నరకుడు అసుర ప్రభావంలో పడి ఘోరతపస్సు చేసి అనేక వరాలు పొందాడు. తనకు తన తల్లి చేతిలో తప్ప మరణం సంభవించకూడదని కూడా వరం పొందాడు. ఎందుకంటే స్వయానా తన తల్లే తనను చంపదని అతని ధీమా. ఆ వరగర్వంతో అతను చేసిన దుష్కార్యాలు పరాకాష్టకు చేరి దేవతలను తీవ్ర అశాంతికి గురి చేసాయి. నరకుడు విష్ణుద్వేషియై దేవతలను హింసించసాగాడు.

దేవమాత అదితి కుండలాలను, వరుణ ఛత్రాన్ని అపహరిస్తే శ్రీ కృష్ణుడు ఇతనిని ద్వంద్వ యుద్ధంలో ఓడించి, వాటిని తిరిగి అదితికి అందజేసాడు. మరొకప్పుడు మదపుటేనుగు రూపంలో విశ్వకర్మ పుత్రికను చెరపట్టాడు. వీరూవారనే విచక్షణ లేకుండా గంధర్వ, దేవ, మానవ కన్యలను బలవంతంగా అపహరించి, తన అంతఃపుర పంజరంలో బంధించడం వాడికో వ్యసనం. ఇతని దౌర్జన్యాలు అంతటితో ఆగలేదు. చివరకు ఇంద్రునిపైకి కూడా దండెత్తి ఆయన అధికార ముద్రను అపహరించడంతో ఈ రాక్షసాధముని దురంతం పరాకాష్టనందుకుంది. ఇంద్రుడు ఆపద రక్షకుడైన శ్రీ కృష్ణుని శరణు వేడగా గోపాలుడు నరకునిపై దండెత్తాడు. అయితే నరకాసురుని విషపుబాణానికి శ్రీ కృష్ణుడు ఒక క్షణంపాటు నిశ్చేష్టుడయ్యాడు. అది గమనించి ఆయనతో కూడానే ఉన్న ఆయన సతీమణి సత్యభామ ఉగ్రురాలై భయంకరమైన తన బాణాన్ని ప్రయోగించి నరకుణ్ణి నిలువరించింది. ఆ తర్వాత కృష్ణుడు తేరుకుని సుదర్శన చక్రం ప్రయోగించి అతడిని సంహరించాడు. అలా ఆశ్వయుజ బహుళ చతుర్దశినాడు లోక కంటకుడైన నరకుని మరణం సంభవించింది. యాదృచ్ఛికంగా నరకాసురుని మరణం సత్యభామ రూపంలో తన తల్లి భూదేవి వల్లనే సంభవించింది.

తన పుత్రుని పేరైనా కలకాలం నిలిచి ఉండేలా చేయమని సత్యభామ ప్రార్థించడంతో ఆ రోజు నరక చతుర్దశిగా పిలువబడుతుందని వరం ప్రసాదించాడు శ్రీ కృష్ణుడు. నరకుని చెరనుండి సాధుజనులు, పదహారు వేలమంది రాజ కన్యలు విడిపించబడ్డారు, ధర్మం సుప్రతిష్ఠమైంది.

ఈ రోజు ఏం చేయాలి?

ఈ చతుర్దశి యమునికి ఎంతో ఇష్టమైన రోజు. ఈ రోజు సూర్యోదయానికి ముందే నువ్వుల నూనెతో తలంటుకొని, అభ్యంగన స్నానం చేయాలి. ప్రత్యేకించి ఆ వేళ నువ్వులనూనెలో లక్ష్మి, మంచినీటిలో గంగాదేవి కొలువై ఉంటారని శాస్త్రాలు వివరిస్తున్నవి. యమ ధర్మరాజును స్మరించి, నమస్కరించి, యమ తర్పణ చేయడాన్ని విశిష్టంగా పెద్దలు చెబుతారు. అభ్యంగన స్నానానంతరం దక్షిణాభిముఖంగా 'యమాయః తర్పయామి' అంటూ మూడుసార్లు నువ్వులతో యమునికి తర్పణం ఇవ్వడం ఆచారం. యముని పూజించి, మినుములతో చేసిన పదార్థాలు తినడంతో పాటు సూర్యాస్తమయం తర్వాత ముంగిట్లో, పడకగదిలో దీపాలను వెలిగించి, టపాకాయలు కాలుస్తారు. ఈ చతుర్దశి రోజు సాయంత్రం ఎవరైతే దీపాలు వెలిగించి దానధర్మాలు చేస్తారో వారి పితృదేవతలకు నరకబాధ తొలగుతుందని భారతీయుల నమ్మకం.

నరక చతుర్దశినాడు దీపదానం చేస్తే పితృదేవతలందరికీ స్వర్గనివాసం కలుగుతుందని విశ్వసిస్తారు. ఇదేరోజున సాయం సమయంలో నూనెతో తడిపిన, రసాయన ద్రవ్యాలతో తయారు చేసిన కాగడాలను చేతబట్టుకొని తిరిగినట్లయితే పితృదేవతలకు దారి చూపినట్లవుతుందనీ పెద్దలు నమ్ముతారు. నరకచతుర్దశి మరునాడే దీపావళి.

– డి.వి.ఆర్.

● ఆఫీసర్లు

నరకాసురులపై నారీ శక్తి

దుష్ట ప్రవృత్తి గల నరకాసురుడిపై సత్యభామ సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి జరుపుకుంటాం. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నేరాలు చేసే ఎందరో నరకాసురులకు సత్యభామలుగా మారిన పోలీసు ఆఫీసర్లు చెక్ చెప్తున్నారు. నేడు నరక చతుర్దశి సందర్భంగా మహిళా పోలీస్ అధికారుల ప్రాధాన్యం గురించి...





హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడెమీలో (ఎన్‌పీఏ) తాజాగా శిక్షణ పూర్తి చేసుకున్న ఐపీఎస్ అధికారుల్లో 36 శాతం మహిళలే. ఎన్‌పీఏ చరిత్రలో ఇదో రికార్డు. దీనికిముందే ఇలాంటి అరుదైన దృశ్యం తెలంగాణలో ఆవిష్కృతమైంది. సెప్టెంబర్‌లో చోటు చేసుకున్న ఐపీఎస్ అధికారుల బదిలీతో రాష్ట్ర పోలీసు విభాగంలోని హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌లో మకుటాలను 33.3 శాతం మహిళలే ధరించారు.

ఉమ్మడి రాష్ట్రంలో 1979 వరకు మహిళా ఐపీఎస్‌లే లేరు. ఆ ఏడాది ఎన్‌పీఏలో శిక్షణ పూర్తి చేసుకున్న హైదరాబాదీ యువతి అరుణ బహుగుణ చిత్తూరు జిల్లా మదనపల్లె అదనపు ఎస్పీగా పోస్టింగ్ పొందారు. ఇది అప్పట్లో సంచలనం. ఆపై కాలక్రమంలో మహిళ ఐపీఎస్‌ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అయినప్పటికీ 2014 వరకు వీరికి సముచిత పోస్టింగ్స్ ఉండేవి కాదు. అత్యవసర సందర్భాల్లో అక్కరకు రావడానికి కమిషనరేట్‌కు ఒక మహిళ ఐపీఎస్‌కు పోస్టింగ్ ఇచ్చేవాళ్లు. మిగిలిన అధికారుల్ని అంతగా ప్రాధాన్యం లేని పోస్టుల్లో నియమించే వారు.



రానురాను ఆ సీన్ పూర్తిగా మారిపోతూ వచ్చింది. పోలీసు విభాగంలో మహిళ ఐపీఎస్ అధికారుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో పోస్టింగ్స్ ఇవ్వడం అనివార్యంగా మారింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తూ మహిళ భద్రత విభాగం, షీ-టీమ్స్ ఏర్పాటైన తర్వాత వీటిలో అనివార్యంగా మహిళ ఐపీఎస్‌లకే పోస్టింగ్ ఇస్తూ వచ్చారు.





కమిషనరేట్లలో డీసీపీ పోస్టులతో పాటు కొన్ని జిల్లాలకు మహిళల్ని ఎస్పీలుగా నియమించారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తి భిన్నంగా మారిపోయాయి. రాష్ట్ర పోలీసు విభాగంలో ఉన్న మూడో వంతు హెచ్‌ఓడీ పోస్టులతో పాటు హైదరాబాద్, రాచకొండల్లోని డీసీపీ పోస్టుల్లో అత్యధికంగా మహిళా ఐపీఎస్‌లే ఉన్నారు.



ఎస్సైల నుంచి డీఎస్పీల వరకు శిక్షణ ఇచ్చే తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడెమీకి అభిలాష్ బిస్త్, నేరగాళ్లలో మార్పునకు కృషి చేసే జైళ్లశాఖకు సౌమ్య మిశ్ర, రాష్ట్ర నేర పరిశోధన విభాగానికి (సీఐడీ) చారు సిన్హా, మావోయిస్టు వ్యతిరేక నిఘా విభాగమైన బి.సుమతి, హోంగార్డ్స్ వింగ్‌కు స్వాతి లక్రా నేతృత్వం వహిస్తూ తమ సత్తా చాటుతున్నారు. ఈ ప్రకారం చూస్తే 15 హెచ్‌ఓడీ పోస్టుల్లో ఏడింటికి ఐదుగురు మహిళ ఐపీఎస్‌లు నేతృత్వం వహిస్తున్నట్లు లెక్క. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు శిఖా గోయల్ చీఫ్‌గా, అవినీతి నిరోధక శాఖకు చారు సిన్హా ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఇక రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో మహిళా పోలీసుల సంఖ్య తక్కువగా ఉండటంతో పాటు ఉన్నత స్థాయిలో కూడా ఉండేవారు కారు. అయితే కాలక్రమంలో వీరి సంఖ్య కాస్త పెరిగినా...







నగరంలో హఠాత్తుగా తలెత్తే పరిణామాలతోపాటు మతకలహాలను అదుపు చేయడం, వేళాపాళా లేని విధులు వీరితో సాధ్యం కాదనే భావన గతంలో ఉండేది. కాలక్రమంలో చోటు చేసుకున్న పరిస్థితులు, పరిణామాల నేపథ్యంలో నగర పోలీసు విభాగంలోనూ ఒక మహిళ ఉన్నతాధికారి ఉండాలని ప్రభుత్వమూ భావించినప్పటికీ చాన్నాళ్ళ వరకు కేవలం నార్త్‌జోన్‌కు మాత్రమే మహిళ అధికారిని నియమిస్తూ వచ్చారు. ఆ జోన్‌కు ఉండే ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో సిటీ పోలీసువింగ్‌లో మహిళ ఉన్నతాధికారి పోస్టు ఇదొక్కటే అనే భావన కొనసాగింది.

ప్రస్తుతం పరిస్థితులు మాత్రం పూర్తిగా మారిపోయాయి. హైదరాబాద్ కమిషనరేట్‌లో ఏడు జోన్లు ఉన్నాయి. ఒక్కో జోన్‌కు ఒక్కో డీసీపీ నేతృత్వం వహిస్తుంటారు. ప్రస్తుతం ఈ ఏడు జోన్లలో మూడింటికి మహిళ ఐపీఎస్‌లే డీసీపీలుగా ఉన్నారు. మధ్య మండలానికి శిల్పవల్లి, ఉత్తర మండలానికి సాధన రష్మి పెరుమాళ్, దక్షిణ మండలానికి స్నేహ మెహ్రా డీసీపీలుగా ఉన్నారు. వీరికి తోడు పరిమళ నూతన్, పరిపాలన విభాగం సంయుక్త సీపీగా, రక్షితమూర్తి, సీఏఆర్ హెడ్-క్వార్టర్స్ డీసీపీగా, అపూర్వ రావు- స్పెషల్ బ్రాంచ్ డీసీపీగా, ఎన్.శ్వేత డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ డీసీపీ గా, డి.కవిత,సైబర్ క్రైమ్ విభాగం డీసీపీగా, లావణ్య జాదవ్– ఉమెన్ సేఫ్టీ డీసీపీగా పని చేస్తున్నారు.

హైదరాబాద్ చుట్టూ విస్తరించి ఉన్న సైబరాబాద్‌లోని అత్యంత కీలకమైన మాదాపూర్ జోన్‌కు డీసీపీగా రితిరాజ్ వ్యవహరిస్తున్నారు. ఇక రాచకొండలో మొత్తం నాలుగు జోన్లు ఉన్నాయి. వీటిలో మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, మహేశ్వరానికి పద్మజ రెడ్డి, అనురాధ, సునీత రెడ్డి డీసీపీలుగా ఉన్నారు. వీరిలో సునీత రెడ్డి మాత్రమే నాన్ ఐపీఎస్ అధికారి. ఈ జోనల్ డీసీపీలతో పాటు మహిళ భద్రత విభాగం, సైబర్ క్రైమ్ వింగ్స్‌లను ఆ'షీ'సర్స్ నేతృత్వం వహిస్తున్నారు.

– శ్రీరంగం కామేష్,
క్రైమ్ రిపోర్టర్, సాక్షి, హైదరాబాద్

రావణుడు... మా ఊరి అల్లుడు!

దీపావళి అంటేనే సంబరాలు అంబరాన్ని అంటుతాయి. అయితే రాజస్థాన్‌లోని జోద్‌పూర్‌కు పది కిలోమీటర్‌ల దూరంలో ఉన్న మండోర్‌లో దీపావళి రోజు దీపాలు వెలిగించడం, బాణసంచ కాల్చడం ఉండదు. నిశ్శబ్దాన్ని పాటిస్తారు. కారణం ఏమిటి? అనే విషయానికి వస్తే స్థానిక పురాణం తెలుసుకోవాల్సిందే. దీని ప్రకారం... రావణుడి భార్య మండోదరి జన్మస్థలం మండేరే. రావణుడు మండోదరిని ఈ గ్రామంలోనే వివాహం చేసుకున్నాడని నమ్ముతారు. మండేరేకి చెందిన మౌద్గిల్ బ్రాహ్మణులు తమను తాము మండోదరి కుటుంబ వారసులుగా భావిస్తారు. అందువల్ల వారు రావణుడిని రాక్షస రాజుగా కాకుండా గౌరవనీయమైన బంధువుగా చూస్తారు!

చీకటి దీపావళి!

దీపావళి వేడుకల తర్వాత హిమాచల్‌ప్రదేశ్‌లో బుద్ధి దీపావళి(చీకటి దీపావళి లేదా పాత దీపావళి) జరుపుకుంటారు. దీపావళి తర్వాత మొదటి అమావాస్య రోజు బుద్ధి దీపావళి వేడుకలు మొదలవుతాయి. రాముడి రాక వార్త ఒక నెల తర్వాత మాత్రమే హిమాచల్‌ప్రదేశ్‌కు చేరిందట. అందుకే ఆలస్యంగా పండగ జరుపుకునే సంప్రదాయం మొదలైంది అంటారు.

దేవరి రాత్రి

ఛత్తీస్‌ఘడ్‌లోని గోండు తెగలు దీపావళిని 'దేవరి'గా జరుపుకుంటాయి. దేవరి రాత్రి గ్రామంలోని మహిళలు తలలపై ఒక కుండలో నూనె దీపాన్ని వెలిగించి శ్రావ్యంగా పాటలు పాడుతూ, ప్రతి ఇంటి తలుపు తడుతూ తమతో చేరాలని ఆ ఇంటి మహిళలను అభ్యర్థిస్తారు. బియ్యపు పిండితో చేసిన దీపాలను ప్రతి ఇంటి ముందు ఉంచుతారు.

ఆవులను తమపై నడిపించి...

మధ్యప్రదేశ్ ఉజ్జయిని జిల్లాలోని బిదావాద్ గ్రామంలో ఒక వింత ఆచారం ఉంది. దీపావళి రోజు తరువాత నేలపై పడుకొని ఆవులను తమపై నడిపించుకుంటారు. 33 కోట్ల దేవుళ్లు, దేవతలు ఆవులో కొలువై ఉన్నారని, వాటిని తమపై నడిపించుకోవడం ద్వారా దేవతల ఆశీర్వాదం దొరుకుతుందనేది భక్తుల నమ్మకం.

భర్త కోసం రాత్రంతా దీపాలు...

మహారాష్ట్రలో దీపావళి వేడుకలకు సంబంధించి ఒక ఆసక్తికరమైన జానపద కథ ప్రచారంలో ఉంది. వివాహం జరిగిన నాలుగు రోజుల తరువాత చనిపోతాడని యువ రాజుకు శాపం. విషయం తెలిసిన వధువు తన భర్త ప్రాణాలు రక్షించుకోవడం కోసం రాత్రంతా అవిశ్రాంతంగా దీపాలు వెలిగిస్తూనే ఉంటుంది. ఆమె ప్రయత్నాల వల్ల భర్త బతుకుతాడు.

శ్రీవిష్ణువు భూలోకానికి...

గుజరాత్‌లో దీపావళి రోజు కొత్త వ్యాపారాలు ప్రారంభించడం అనేది తరతరాలుగా వస్తోంది. మహాలక్ష్మీదేవి భర్త విష్ణువు భూలోకానికి వచ్చిన గుర్తుగా మధ్యప్రదేశ్‌లో దీపావళి జరుపుకుంటారు. కోల్‌కత్తాలో దీపావళికి కాళీ పూజ చేస్తారు.

సోదర, సోదరీమణులు...

మన దేశంలోని కొన్ని ప్రాంతాలలో దీపావళి అనేది సోదర, సోదరీమణుల అనుబంధానికి ముడి పడి ఉన్న పండగగా జరుపుకుంటారు. దీపావళి తర్వాత రోజు జరుపుకునే ఈ పండగను 'యమ–ద్వితీ' అని పిలుస్తారు. యమున తన సోదరుడు, మృత్యుదేవుడు యముడికి ఆతిథ్యం ఇచ్చిన రోజు ఇదే అని పురాణ కథలు చెబుతాయి.

లక్ష దీపాల ఆగ్రా కోట

అక్బర్ చక్రవర్తి పాలనలో దీపావళిని ఆనందోత్సాహాలతో జరుపుకునేవారు. ఈ సంప్రదాయాన్ని 'జష్నే చిరాఘన్' అని పిలిచేవారు. లక్షలాది దీపాలతో ఆగ్రా కోట వెలిగిపోయేది. కోట ముందు ఉన్న మైదానంలో బాణసంచా కాల్చేవారు.

● కళా స్ఫూర్తి

'ఒక మహిళ పురుషుడి పాత్రలో మెప్పించడం చాలా కష్టం' అంటారు సురభి కళాకారిణి 60 ఏళ్ల పద్మజా వర్మ. ఇప్పటి వరకు కృష్ణుడి పాత్రలో వేదికలపైన 3000కు పైగా నాటక ప్రదర్శనలు ఇచ్చిన పద్మజా వర్మ సత్యభామగానూ మెప్పించారు. ప్రత్యేక పురస్కారాలనూ అందుకున్నారు. నేడు నరకచతుర్దశి సందర్భంగా కృష్ణుడి పాత్రలో జీవించిన పద్మజా వర్మ సాక్షి ఫ్యామిలీతో పంచుకున్న విశేషాలు ...

కృష్ణుడిగా... సత్యభామ!

సురభి పద్మజ వర్మకు దాదాపు 60 ఏళ్ల నాటక రంగ అనుభవం ఉంది. కృష్ణుడి పాత్రలో ప్రేక్షకులను మెప్పిస్తూ, కుటుంబ పోషణలో భాగమయ్యింది. గృహిణిగా, ఇద్దరు పిల్లల తల్లిగా, కోడలిగా కుటుంబ జీవనంలోని సర్దుబాట్లను, తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న విధానాన్ని మన ముందుంచారు.



మగవారి మధ్యలో ఒక్కదాన్నే మహిళను

"మగవేషాలంటే చాలా ఠీవిగా నిలబడాలి. హుందాగా కనిపించాలి. కిరీటం పెట్టుకొని వేసే వేషం ఏదైనా కష్టమే. అందులోనూ మహిళ పురుషుడి వేషం వేయడం పెద్ద సవాల్. ఆ సమయంలో స్టేజీపైన చుట్టూతా మగవారే. కృష్ణుడి వేషంలో నేనొక్కదాన్నే మహిళను. నటనలో ఎటువంటి జంకు కనిపించకూడదు. గొంతులో తత్తరపాటు ఉండకూడదు. కిరీటం పక్కకు జరగకూడదు. ఫ్లూట్ పట్టుకోవడంలో నేర్పు ఉండాలి. అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ రెండున్నర గంటల పాటు సీనును రక్తికట్టించాలి. అదో పెద్ద టాస్క్.



బాల్యం నుంచీ...

మూడు నెలల పసిబిడ్డగా ఉన్నప్పుడే మా అమ్మానాన్నలు నన్ను వేదికమీదకు తీసుకెళ్లారు. శ్రీకృష్ణ లీలల్లో భాగంగా బాల కృష్ణుడి పాత్రలను ప్రదర్శించాను. మాకు చదువు అయినా, నటన అయినా కళారంగమే. పన్నెండేళ్ల తర్వాత మాయా బజార్‌లో శశిరేఖగా వేషాలు వేశాను. శశిరేఖగా ప్రదర్శనలో పాల్గొన్నప్పుడు నా పాత్ర పూర్తయ్యాక ఒక వైపు కూర్చొని ఆ నాటక ప్రదర్శన మొత్తం చూసేదాన్ని. శశిరేఖ పాత్ర టీనేజ్ వరకే. ఆ వయసు దాటితే ఆ పాత్ర మరొకరికి ఇచ్చేస్తారు. నాకూ కొంత వయసు వచ్చాక శశిరేఖ బదులు రుక్మిణి, సత్యభామ.. ఇలా మహిళా ప్రాధాన్యత గల వేషాలే ఇచ్చారు.

సత్యభామ.. మీరజాలగలరా..!

కృష్ణుడి పాత్రకు దీటుగా ఉండేది సత్యభామ పాత్రే. సత్యభామగా నటించేటప్పుడు ఆ పాత్రకు ఉన్న హావభావాలన్నీ ముఖంలో పలికించాలి. 'మీర జాల గలడా నా యానతి...' అనే పాటలో నవరసాలు ఒలికించాలి. స్త్రీ పాత్రల్లోనూ మెప్పిస్తూ .. ఒక్కో దశ దాటుతున్న కొద్దీ మహిళా ప్రాధాన్యత ఉన్న పాత్రలు మారిపోతుండటం గమనించాను.

సందేహాలను జయిస్తూ... కృష్ణుడిగా మెప్పిస్తూ!

ఇలాగే ఉంటే కళారంగంలో నా ప్రాధాన్యత ఏముంటుంది అని నన్ను నేనే ప్రశ్నించుకునేదాన్ని. 'పురుష పాత్రలు అయితేనే మార్పు లేకుండా ఎప్పటికీ వేయచ్చు. ఎలాగా...' అని ఆలోచించేదాన్ని. పెళ్లయ్యాక మా మామగారి సొంత నాటక కంపెనీలోనే రకరకాల మహిళా ప్రాధాన్యమున్న పాత్రలు వేశాను. ఒకరోజు కృష్ణ వేషధారి ఆరోగ్యం బాగోలేక రాలేదు. ప్రదర్శన ఉంది. ఎలా అని ఆందోళన పడుతున్న సమయంలో 'నేను కృష్ణుడిగా వేస్తాను' అని మా మామగారికి ధైర్యం చెప్పాను. అలా మాయాబజార్‌లో కృష్ణుడిగా నటించాను. అయితే, పురుషుడిలా డ్రెస్ అవ్వడం.. మామూలు విషయం కాదని ఆ రోజే తెలిసింది. కంస వధ నాటకంలో మాత్రం కొంత టెన్షన్ పడ్డాను. ఎందుకంటే, కంస పాత్రధారి మా మామగారే. కంసుని వధించేటప్పుడు బాహాబాహి తలపడటం, గుండెల మీద కొట్టడం.. వంటివి ఉంటాయి. కానీ, నటనలో రిలేషన్ కాదు ప్రతిభనే చూపాలనుకున్నాను. అక్కణ్ణుంచి ఇక నేనే కృష్ణుడిని. అలా నేటివరకు 3000కు పైగా కృష్ణుడి పాత్రలు వేసిన ఘనత నాకు దక్కింది. నాటకాన్ని చూసిన ప్రేక్షకులు స్వయంగా కలిసి, వారి అభిమానాన్ని తెలుపుతూ ఉంటారు. సాధారణ చీరలో నన్ను చూసినవారు 'మీరేనా కృష్ణుడు' అని ఆశ్చర్యపోతుంటారు. ఎందుకంటే, అలంకరణలో వేదికపైన కృష్ణుడిలా మరో కొత్త జన్మ ఎత్తినట్టుగా ఉంటుంది. అప్పట్లో భయపడి కృష్ణుడి పాత్రను వదిలేసి ఉంటే.. నాటకరంగంలో నా ప్రత్యేకత అంటూ ఏమీ ఉండేది కాదు. నాకు ఈ యేడాది 60 ఏళ్లు పూర్తయ్యాయి. ఆ కృష్ణ పరమాత్మ అనుగ్రహం వల్ల మా పిల్లలిద్దరూ జీవితాల్లో బాగానే స్థిరపడ్డారు. ఇక నాకు బాధ్యతలేం లేవు కాబట్టి నా చివరిశ్వాస వరకు కృష్ణుడిలా నాటకరంగంలో మెప్పిస్తూనే ఉంటాను" అని వివరించారు కృష్ణ పాత్ర ధారి పద్మజావర్మ.

– నిర్మలా రెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి